సాక్షి
పార్వతీపురం మన్యం

బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023



డ్వాక్రా చెల్లింపులకు పేటీఎం

మహిళా సంఘాల్లో ఆర్థిక అక్షరాస్యత పెరిగింది. డిజిటల్ లావాదేవీలకు మొగ్గుచూపుతున్నారు. జిల్లా అధికార యంత్రాంగం దీనిని ప్రోత్సహిస్తోంది.

- 8లో



శరవేగంగా రైల్వేస్టేషన్ అభివృద్ధి

పార్వతీపురం నూతన రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నట్లు రైల్వే డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) సౌరవ్ ప్రసాద్ తెలిపారు.

- 8లో

నేడు దసరా ఉత్సవ ఏర్పాట్లపై సమావేశం

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై చర్చించేందుకు బుధవారం సమావేశం నిర్వహిస్తామని ఆలయ ఈఓ మురళీకృష్ణ తెలిపారు. పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటలకు ఆలయ ఆవరణలో సమావేశమవుతామన్నారు. అక్టోబర్ 15 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే దసరా ఉత్సవాలకు సూచనలు అందించాలని పట్టణ ప్రజలను కోరారు.

న్యూస్‌రీల్

పుష్పాలంకరణలో శంబర పోలమాంబ



చదురు గుడిలో పుష్పలంకరణతో పోలమాంబ అమ్మవారు

మక్కువ: శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకుని ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్యదేవత శంబర పోలమాంబ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. చదురుగుడి, వనంగుడిలో పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవార్లను దర్శించారు. పసుపుకుంకుమలు సమర్పించారు. మొక్కుబడులు చెల్లించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ వాకచర్ల రాధాకృష్ణ ఏర్పాట్లు చేశారు.

సీతంపేటలో ఎస్‌జీఎఫ్ ఎంపికలు



ఎంపికైన విద్యార్థులతో అధికారులు, సిబ్బంది

సీతంపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్థానిక గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, షటిల్‌బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్ ఎంపిక పోటీలు మంగళవారం నిర్వహించారు. 26 పాఠశాలలకు చెందిన సుమారు 500ల మంది విద్యార్థులు హాజరైనట్టు సంబంధిత సెలెక్షన్ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీఈఓ లిల్లీరాణి, ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకాబ్‌దయానంద్, పీడీలు ఆర్.సి.రెడ్డి, వెంకట్రావు, రమణమూర్తి, ఈశ్వరరావు, సూర్యనారాయణ, నాగేశ్వరరావు, సింహాచలం, శ్రీను, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యానికి టీకా తప్పనిసరి

- జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు



గుణానపురంలో చిన్నారికి టీకా వేస్తున్న డీఐఓ జగన్మోహనరావు

కొమరాడ: ప్రాణాంతక వ్యాధులకు గురికాకుండా పిల్లల ఆరోగ్య పరిరక్షణకు వ్యాధి నిరోధక టీకాలు విధిగా వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా కొమరాడ మండలం గుణానపురం, ఆర్తాం గ్రామాల్లో మంగళవారం చేపట్టిన టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. పిల్లలకు షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నిర్మల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పార్వతీపురంలో జగనన్న చెబుదాం

పార్వతీపురం: మండల స్థాయిలో కలెక్టర్ నేతృత్వంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని బుధవారం పార్వతీపురంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. అలాగే ఈనెల 15న బలిజిపేట, 20న కొమరాడ, 22న మక్కువ, 27న గరుగుబిల్లి, 29న పాలకొండ, అక్టోబర్ 4న జియ్యమ్మవలస, 6న వీరఘట్టం, 11న కురుపాం, 13న సీతంపేట, 18న సాలూరు, 20న పాచిపెంట, 25న భామిని, 27న గుమ్మలక్ష్మీపురం మండలాలలో జరుగుతుందని పేర్కొన్నారు. ఆయా మండలాలలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు అర్జీలను అందజేయాలని కోరారు.

దివ్యాంగులకు బంగారు భవిత



భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ చేస్తున్న ఫిజియోథెరపిస్టు

- దివ్యాంగ విద్యార్థులకు చదువు, ఆరోగ్య భరోసా కల్పిస్తున్న భవిత కేంద్రాలు
- పార్వతీపురం మన్యం జిల్లాలో 15 భవిత కేంద్రాలు
- కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులు 1200 మంది
- ఈ ఏడాది గుర్తించిన చిన్నారుల సంఖ్య: 109
- త్వరలో దృష్టి వినికిడిలోపం ఉన్న విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

వీరఘట్టం: దివ్యాంగ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు భవిత కేంద్రాలు బాటలు వేస్తున్నాయి. అంగవైకల్యం నుంచి కోలుకునేలా ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నాయి. ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు సులభపద్ధతుల్లో సహిత విద్యను బోధిస్తున్నాయి. గతంలో భవిత, నాన్ భవిత కేంద్రాలుగా ఉండేవి. ఎంఈఓ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలు పాఠశాలలకు దూరంగా ఉండేవి. పాఠశాలల్లో ఉన్న వాటిని నాన్ భవిత కేంద్రాలుగా పిలిచేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కేంద్రాలన్నింటిని భవిత కేంద్రాలుగా పేర్కొంటూ మండల కేంద్రాల్లో అన్ని వసతులు ఉన్న పాఠశాలల్లో ఏర్పాటు చేసింది.

పార్వతీపురం మన్యం జిల్లాలో 15 భవిత కేంద్రాలు

జిల్లాలోని 15 మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున భవిత కేంద్రాలు ఉన్నాయి. గతంలో పాఠశాలలకు



దివ్యాంగ విద్యార్థుల బోధనకు ప్రత్యేకంగా రూపొందించిన ప్రశస్త యాప్‌ను చూపిస్తున్న డీఈఓ, సహిత ఉపాధ్యాయులు

దూరంగా ఉన్న భవిత కేంద్రాల్లోని మానసిక, దివ్యాంగ విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి దూరమయ్యేవారు. ఈ పరిస్థితులను గమనించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భవిత కేంద్రాలను పాఠశాలల్లోనే ఏర్పాటుచేసి వారికి జగనన్న గోరుముద్ద, రాగిజావ ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చింది. పాలకొండ, పార్వతీపురం, సాలూరు, కురుపాం నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో ఉన్న భవిత కేంద్రాలను సమీపంలోని పాఠశాలల్లో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంది. ఈ 15 భవిత కేంద్రాల్లో 1200 మంది దివ్యాంగ, మానసిక వైకల్యం గల విద్యార్థులకు 10 మంది ఫిజియోథెరపిస్టులు, 15 ఐఈఆర్‌ఫీలు, 15 మంది ఆయాలు సేవలు అందిస్తున్నారు. ఈ ఏడాది ఎన్‌రోల్మెంట్ డ్రైవ్‌లో గుర్తించిన 109 బాలలకు కూడా వీరు సేవలందిస్తున్నారు.

రెండుసార్లు ఉపకరణాల పంపిణీ

గత ప్రభుత్వం భవిత కేంద్రాల నిర్వహణపై చిన్న చూపు చూసింది. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక దివ్యాంగ చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలనే సదుద్దేశంతో రాష్ట్రంలో 4 వేల ట్యాబ్‌లను అందించారు. జిల్లాలో వినికిడి, దృష్టి లోపం ఉన్న దివ్యాంగ విద్యార్థులకు బోధన చేసే ఐఈఆర్పీలు, స్కూల్ అసిస్టెంట్లకు త్వరలో 87 ట్యాబ్‌లను అందించనున్నారు. ఇప్పటికే దివ్యాంగ విద్యార్థులకు కావాల్సిన ఉపకరణాలైన వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు తదితర రూ.5.50 లక్షల విలువ గల యంత్ర పరికరాలను రెండు దఫాలుగా అందించారు. ఫిజియోథెరపీ, బ్రెయిలీ, స్పీచ్ థెరపీపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.

భవిత కేంద్రాలపై ప్రత్యేక దృష్టి



భవిత కేంద్రాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మండల కేంద్రాల్లోని పాఠశాలలకు అనుసంధానం చేస్తూ ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల్లో చిన్నారులకు సహితవిద్యనందిస్తున్నాం. వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు తదితర పరికరాలను ప్రభుత్వం సమకూర్చింది. ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల్లో మానసిక స్థైర్యాన్ని పెంచుతూ విద్యను బోధిస్తున్నాం.

– పి.భానుమూర్తి, ఐఈ, కో–ఆర్డినేటర్, పార్వతీపురం మన్యం జిల్లా

అందుబాటులో ప్రశస్త యాప్



దివ్యాంగ విద్యార్థులకు బోధనకు వీలుగా ప్రత్యేకంగా ప్రశస్త యాప్ అందుబాటులో ఉంది. జిల్లాలోని పాఠశాలల ఉపాధ్యాయులు గూగుల్ ప్లే స్టోర్ ద్వారా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆయా పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు ఉంటే ఆ వివరాలు నమోదు చేసి అప్‌డేట్ చేయాలి. దీనివల్ల ఆ విద్యార్థులకు ఏ ఉపకరణాలు అవసరమో గుర్తించి, వాటని ప్రభుత్వం నుంచి అందేలా చూస్తాం. పాఠశాలల్లోనే భవిత కేంద్రాలను ఏర్పాటు చేయడం వల్ల జగనన్న గోరుముద్దతో పాటు రాగిజావ కూడా అందుతోంది.

– ఎస్.ప్రేమ్‌కుమార్, డీఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా

ఒక్క రూపాయికే ఇల్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

- ఇది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఘనత

పార్వతీపురంటౌన్: పట్టణ పేదలకు ఒక్క రూపాయికే పక్కా ఇంటిని అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. పార్వతీపురం పట్టణంలోని 8వ వార్డులో మంగళవారం పర్యటించారు. లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను సైతం లబ్ధిదారులు త్వరితగతిన పూర్తిచేసుకోవాలన్నారు. లక్షలాది రూపాయలు విలువచేసే స్థలంతో పాటు ఇళ్ల నిర్మాణానికి రూ.1.80 లక్షలు, రాయితీపై నిర్మాణ సామగ్రిని ప్రభుత్వం సమకూర్చుతోందన్నారు. పేదలందరికీ పక్కా ఇంటి భాగ్యం కల్పించాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేయమన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న నవరత్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తప్పులులేని ఓటరు జాబితా రూపొందించాలి



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్, జిల్లా అధికారులు

పార్వతీపురం: ఓటరు పునశ్చరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ ఓటరు విచారణలో తప్పులులేని ఓటరు జాబితాను రూపొందించాలని ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్‌మీనా అన్నారు. ఓటరు జాబితా తయారీపై మంగళవారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ ఓటర్ల తొలగింపు ప్రక్రియలో నోటీసు జారీ, శాశ్వత వలసల ఓటర్లు పంచనామా, వీడియో స్టేట్‌మెంట్ తదితర అంశాలను పారదర్శకంగా చేపడుతున్నట్టు తెలిపారు. ఇంటింటి ఓటరు విచారణచేసి శాశ్వతంగా గ్రామాలను వదలిన వారిని, మృతిచెందిన వారిని, డూప్లికేట్ ఎంట్రీ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని తొలగించే కార్యక్రమం వేగవంతం చేశామన్నారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ పీఓలు సి.విష్ణుచరణ్, కల్పనాకుమారి, డీఆర్వో జె.వెంకటరావు, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్, ఆర్డీఓ కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఏం కష్టమొచ్చిందో...?

- వ్యవసాయ బావిలో పడి కుమార్తెతో కలిసి దంపతుల ఆత్మహత్య
- కొత్తవలస మండలం చింతలపాలెం సమీపంలో ఘటన
- మృతులు విశాఖపట్నం జిల్లా మర్రిపాలెం వాసులుగా గుర్తింపు
- ఘటనా స్థలాన్ని సందర్శించిన విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు



మృతులు మొహిసుద్దీన్, భార్య నిషా, కుమార్తె జహీదా (ఫైల్)



బావిలో తేలియాడుతున్న మృతదేహాలను పరిశీలిస్తున్న సీఐ చంద్రశేఖర్

కొత్తవలస: ఆ కుటుంబానికి ఏం కష్టమొచ్చిందో తెలియదు. ఆరోగ్యం, ఆర్థికంగా బాగానే ఉన్నా... ఊరు కాని ఊరు వచ్చి కుమార్తెతో కలిసి దంపతులిద్దరూ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చింతలపాలెం గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకొంది. పోలీసులు, స్థానికులు, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..

విశాఖపట్నంలోని షిప్పింగ్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తూ ఆ జిల్లాలోని మర్రిపాలెం సమీపంలోని ఎఫ్‌సీఐ కాలనీలో నివసిస్తున్న మహ్మద్ మొహిసుద్దీన్ (46), ఆయన భార్య సంషి నిషా (38), కూతురు ఫాతిమా జహీదా (17)లు చింతలపాలెం సమీపంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతులు చింతలపాలెం గ్రామ సమీపంలో గతంలో కొంత భూమిని కొనుగోలు చేశారు. ఈ భూమిని చూసేందుకు క్యాబ్‌ను బుక్‌చేసుకుని ఇంటి నుంచి సోమవారం వచ్చారు. సాయంత్రం వరకు ఆ ప్రాంతంలో తిరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. ఏ సమయంలో బావిలో దూకారో తెలియరాలేదు. బావిగట్టుపై మృతుడికి చెందిన సెల్‌ఫోన్, తమ బంధువులకు సంబంధించిన ఫోన్ నంబర్లు రాసిన కాగితం, ఇతర వస్తువులు ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. బావిలోకి చూడగా మృతదేహాలు తేలియాడడం గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో సీఐ ఎస్.చంద్రశేఖర్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ దొరికిన ఆధారాలతో ఫోన్ చేసి మృతుడు మొహిసుద్దీన్ కొడుకు మహ్మద్ ఆలీకి సమాచారం అందించారు. మృతుల కటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని మృతులను గుర్తించారు. ఆలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. మృతురాలు జహీద విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. కొడుకు ఆలీ ఎంబీఏ చదువుతున్నాడు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

ఘటనా స్థలాన్ని విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు సందర్శించారు. క్లూస్ టీమ్‌తో క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని కోణాల్లోనూ పరిశీలిస్తున్నట్టు ఆయన తెలిపారు. మృతుల సెల్‌ఫోన్‌లను ఓపెన్ చేసి కాల్‌డేటాను సేకరిస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు. కాల్ డేటా సేకరిస్తే ఆత్మహత్యకు గల కారణాలు తెలిసే అవకాశం ఉంటుందన్నారు.

ఐటీఐలో విద్యార్థినులకు ప్రవేశాలు

సీతంపేట: స్థానిక ఐటీఐలో గిరిజన మహిళా అభ్యర్థులకు వివిధ ట్రేడ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటారు మెకానిక్ వెహికల్, వెల్డర్, డ్రెస్‌మేకింగ్, కోపా కోర్సుల్లో ప్రవేశాలు ఉంటాయన్నారు. ఆన్‌లైన్‌లో ఈనెల 19 వ తేదీలోగా రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 22న స్థానిక ఐటీఐలో కౌన్సెలింగ్ చేస్తామన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఈ నెల 20వ తేదీలోగా చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 99893 86634, 63053 02188 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సరిహద్దు గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం'

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరించిన డిప్యూటీ సీఎం రాజన్నదొర
- జోరువానలోనూ సాగిన కార్యక్రమం
- రాజన్న వెంట నడిచిన గిరిజనం



చెక్కవలసలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

మక్కువ: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని పనసభద్ర, చిమిడివలస, చెక్కవలస, ఎర్రసామంతవలస గ్రామాల్లో డిప్యూటీసీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గడపగడపకూ వెళ్లి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలనను వివరించారు. అవినీతికి తావులేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్టు వివరించారు. పథకాల లబ్ధికి సంబంధించిన కరపత్రాలను అందజేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీపేదవానికి సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. పలువురు గిరిజనులు ఇళ్లు మంజూరుచేయాలని, ఇళ్ల స్థలాలు, సీసీరోడ్లు, కాలువలు కావాలని, విద్యుత్ లైన్ మార్చాలని డిప్యూటీ సీఎంకు విన్నవించారు. అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. జోరువానలో సాగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాజన్నదొర వెంట గిరిజనులు నడిచారు.

గట్టి బందోబస్తు

ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాల సరిహద్దు గ్రామాలైన చెక్కవలస, ఎర్రసామంతవలస, పనసభద్ర గ్రామాలు మావోయిస్టు ప్రభావితమైనవి. ఇప్పటివరకు మంత్రి స్థాయి పాలకులు ఎవ్వరూ ఈ గ్రామాల్లో పర్యటించలేదు. ఇప్పుడు మావోల ప్రభావం లేకపోయినా డిప్యూటీ సీఎం రాజన్నదొర పర్యటనకు సీఐ ధనుంజయనాయుడు గట్టిబందోబస్తు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సీదరపు గంగమ్మ, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, ఎంపీడీఓ సీహెచ్.సూర్యనారాయణ, రెవెన్యూ అధికారులు, ఏపీఎం సన్నిబాబు, ఏపీఓ ఈశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ మండలనాయకులు పెంట సంజీవు నాయుడు, భీమలింగేశ్వరరావు, బెల్లాన కృష్ణమూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల ఆధునికీకరణకు జెడ్పీ నిధులు

- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలోని సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో వంట గదులు, వంట పాత్రలు, విద్యార్థుల భోజనానికి అవసరమయ్యే అన్ని సౌకర్యాలు, సామగ్రిని మార్చడానికి జిల్లా పరిషత్ నిధులను సమకూర్చనున్నట్టు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 3, 5, 6 జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు చైర్మన్ ఆధ్వర్యంలో మంగళవారం సాగాయి. వసతిగృహాల సామగ్రి పాడైపోయాయని, పెరిగిన విద్యార్థుల సంఖ్యకు ప్రస్తుతం ఉన్న సామగ్రి సరిపోవడం లేదని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై జెడ్పీ చైర్మన్ స్పందిస్తూ ఉమ్మడి జిల్లాల పరిధిలో ఉన్న అన్ని వసతి గృహాలకు, మహిళా ప్రాంగణం, మూగ, చెవిటి పిల్లల పాఠశాలలకు అవసరమైన సామగ్రి కోసం వెంటనే ప్రతిపాదనలు పంపించాలని, జెడ్పీ నిధుల నుంచి లేదా సీఎస్ఆర్ కింద కొత్త సామగ్రి కొనుగోలుకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. జిల్లా పరిషత్‌లో అధికారులు, జెడ్పీటీసీలను సభ్యులుగా పర్చేజ్ కమిటీని ఏర్పాటు చేసి ధరలను, నాణ్యతను తనిఖీ చేయాలని జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్‌కు సూచించారు.

- వ్యవసాయ శాఖ చర్చలో భాగంగా ఎరువుల లభ్యతపై వేపాడ జెడ్పీటీసీ మాట్లాడుతూ డీఏపీ ఎరువును ఆర్‌బీకేలో అందుబాటులో ఉంచాలని కోరారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ అన్ని కాంప్లెక్స్ ఎరువులు ఆర్‌బీకేలలో అందుబాటులో ఉంచాలని, ధరల నియంత్రణకు టాస్క్‌ఫోర్సు కమిటీలను వేసి నిఘా పెట్టాలని వ్యవసాయ శాఖ జేడీకి సూచించారు. ఎరువులన్నీ ఆర్‌బీకేలోని కియోస్కో ద్వారానే పంపిణీ చేయాలని, అప్పుడే ప్రభుత్వ సబ్సిడీ లభిస్తుందని తెలిపారు.
- స్త్రీ,శిశు అభివృద్ధి శాఖ చర్చలో భాగంగా చైర్మన్ మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాల వివరాలను అందజేస్తే వాటి నిర్మాణాలకు జెడ్పీ నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. వీటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించాలని తెలిపారు. మండలాల్లో జరిగే ప్రతీ కార్యక్రమాలకు జెడ్పీటీసీలను తప్పక ఆహ్వానించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్‌బాబు, స్థాయీ సంఘం అధ్యక్షుడు బాపునాయుడు, శాంతికుమారి, సింహాచలం, ఉమ్మడి జిల్లాల జెడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చోరీకేసులో నిందితుడికి ఏడాది జైలు

సీతానగరం: మండలంలోని జానుమల్లువలసలో చోరీ చేసినట్లు రుజువు కావడంతో ముద్దాయికి 1 సంవత్సరం జైలు శిక్ష, రూ 2 వేలు జరిమానా విధిస్తూ బొబ్బిలి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు తీర్పు వెలువరించినట్లు ఎస్సై కె.నీలకంఠం మంగళవారం తెలియ జేశారు. జానుమల్లువలస గ్రామానికి చెందిన యాళ్ల నారాయణరావు ఇంట్లోని బీరువాలో 48 గ్రాముల రెండు పేటల పుస్తెల తాడు ఎవరో దొంగలించారని 2021 అక్టోబర్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై బి.మురళి కేసు నమోదు చేశారు. తదుపరి ఎస్సై నీలకంఠం ఈ కేసును దర్యాప్తు చేసి 2022లో గ్రామానికి చెందిన చుక్క శ్రీనివాసరావు అలియాస్ తిరుపతిరావును అరెస్ట్ చేసి 48 గ్రాముల రెండుపేటల పుస్తెల తాడును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణ అనంతరం బొబ్బిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి ఎం.సరోజనమ్మ వాస్తవాలు నిర్ధారించి ముద్దాయికి పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసును అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నరేశ్ వాదించారు.

షూటింగ్‌బాల్ పోటీల్లో జిల్లాకు ద్వితీయ స్థానం



షూటింగ్ బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం దక్కించుకున్న జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన షూటింగ్ బాల్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన పురుషుల జట్టు సత్తా చాటింది. ఈనెల 8,9,10 తేదీల్లో నెల్లూరు జిల్లా కావలి వేదికగా జరిగిన అంతర్ జిల్లాల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి పి.కృష్ణమూర్తి, ధర్మారావు, ఆనంద్, ప్రసాద్‌లు అభినందించారు.

నియామక పత్రాల అందజేత



కారుణ్య నియామక పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: కారుణ్య నియామకంలో ఆఫీస్ సబార్డినేట్‌లుగా ఉద్యోగం పొందిన ముగ్గురికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం నియామక పత్రాలు అందజేశారు. ఆయన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల బాలింత మృతి

కురుపాం: మండలంలోని గొటివాడ పంచాయతీ బల్లుకోట గ్రామానికి చెందిన రెండు నెలల బాలింత మృత్యువాత పడింది. బల్లుకోటకు చెందిన కొండగొర్రి సుశీల(30) రెండు నెలల క్రితం మగబిడ్డకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి విరోచనం అవకపోవడంతో కడుపు నొప్పితో ఇబ్బంది పడి రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లగా సుఖ విరోచనం అయ్యేందుకు మందులిచ్చి పంపారు. సమస్య యథాతథంగా ఉండడంతో కుటుంబసభ్యులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి సోమవారం తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు చేసి వైద్యం అందించి రిపోర్టుల్లో ఆరోగ్యం బాగా ఉందని ఇంటికి పంపించారు. అయితే సోమవారం రాత్రి ఇంటికి చేరాక ఆమె తుదిశ్వాస విడిచింది. భర్త కుమార్, బంధువులు రెండు నెలల మగ బిడ్డతో కన్నీరు మున్నీరుగా రోదించారు.

పాముకాటుతో మహిళ..

భామిని: మండలంలోని బొమ్మిక గ్రామానికి చెందిన గిరిజన మహిళ పాలక జయమ్మ (51)పాముకాటుతో మంగళవారం మృతి చెందింది. ఈనెల10తేదీ రాత్రి వడ్డంగి నుంచి బొమ్మిక వస్తున్న సమయంలో జయమ్మ పాముకాటుకు గురైంది. తెల్లవారే సరికి పాము కాటు గుర్తించి భామిని పీహెచ్‌సీకి తరలించారు.అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ తరలించి వైద్యసేవలు అందిస్తుండగా జయమ్మ(51)మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి భర్త,ఇద్దరు పిల్లలున్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కె. 10గ్రా.)	60,380–00
బంగారం(22కె. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹156	₹282	₹ 292

డ్వాక్రా చెల్లింపులకు పేటీఎం

- అక్రమాలు అరికట్టేందుకు డిజిటల్ విధానం
- జిల్లాలోని మూడు మండలాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌గా అమలు
- వీఓఏల వద్ద పేటీఎం స్కానర్‌లు



రేగిడి మండలంలో వీఓఏలకు పేటీఎం మిషన్లు అందిస్తున్న అధికారులు

రేగిడి: ఆర్థిక అక్షరాస్యత మహిళా సంఘాల్లో పెరిగింది. ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలితంగా చిట్టి గురువులు కార్యక్రమం ద్వారా జిల్లాలో అక్షరాస్యత శాతం ఎక్కువైంది. ప్రధానంగా మహిళా సంఘాల్లో సభ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలో చిట్టిగురువులు ఉపయోగపడ్డారు. ఈ ఆర్థిక అక్షరాస్యతను సద్వినియోగం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రధానంగా డ్వాక్రా సంఘాల రుణ చెల్లింపులు, వినియోగం తప్పుదారి పట్టకుండా ఉండేందుకు డిజిటల్ విధానాన్ని ముందుకు తీసుకువచ్చింది.

పేటీఎంలో చెల్లింపు

ప్రస్తుతం అన్నిచోట్ల పేటీఎం చెల్లింపులు పెరిగాయి. చిల్లర దుకాణాలు, టీ షాపుల వద్ద కూడా పేటీఎం, ఫోన్‌పే ఉన్నాయి. వాటిని డ్వాక్రా సంఘాల్లో కూడా అమలుచేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. డ్వాక్రా సంఘాలను గ్రామస్థాయిలో ఆర్గనైజ్ చేస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్‌లకు వీటిని అందిస్తుంది. ఆయా గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులు రుణాలు నెలవారీ చెల్లింపు చేయాలన్నా, పొదుపు నగదు చెల్లించాలన్నా వీఓఏలకు నేరుగా నగదు ఇవ్వకుండా పేటీఎం ద్వారా చెల్లించుకోవచ్చు. ఫలితంగా ఆర్థిక అక్రమాలకు చెక్ పడుతుంది.

తొలుత మూడు మండలాల్లో అమలు

పేటీఎంలు డ్వాక్రా సంఘాల్లో వినియోగానికి పైలెట్ పథకం కింద జిల్లాలో మూడు మండలాలను డీఆర్‌డీఏ ఎంపిక చేసింది. వాటిలో రేగిడి, జామి, నెల్లిమర్ల మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో వీఓఏలకు పేటీఎం స్కానర్‌లను వైఎస్‌ఆర్ క్రాంతి పథకం అధికారులు అందజేశారు. ఆయా మండల కేంద్రాల్లోని వైఎస్‌ఆర్ క్రాంతి పథం కార్యాలయాల్లో ఈ మేరకు ఒక్కోరోజు వీఓఏలకు శిక్షణ అందించారు. వీరు గ్రామాల్లో గ్రామైక్య సంఘాలు, గ్రామ సంఘాల్లోని మహిళలకు అవగాహన కల్పిస్తారు. నేరుగా మహిళలు వారి ఆండ్రాయిడ్ మొబైల్ ద్వారా చెల్లింపులు చేసుకోవచ్చు. ఈ విధానంతో డిజిటల్ చెల్లింపులు పెరగడమే కాకుండా లబ్ధిదారులకు ఎటువంటి ఆర్థిక నష్టం జరగకుండా ఉంటుంది.

చాలా మంచి కార్యక్రమం



జిల్లాలోని మహిళా సంఘాల్లో 90 శాతం మంది సభ్యులు ఆర్థిక అక్షరాస్యత ఉన్నవారే. మిగిలినవారి కుటుంబాల్లో కూడా చదువుకున్నవారు ఉన్నారు. పేటీఎం ద్వారా డిజిటల్ చెల్లింపులు చేస్తే ఆర్థిక అక్రమాలు తగ్గుతాయి. ప్రభుత్వం చేస్తున్న ఈ కార్యక్రమం ప్రయోగాత్మకంగా జిల్లాలో ప్రారంభమై ఫలితాలు ఇస్తోంది. ఈ ప్రాజెక్ట్ ఆదారంగా జిల్లా మొత్తం వీటి వినియోగాన్ని పెంచుతాం.

– ఎ. కల్యాణ చక్రవర్తి, డీఆర్‌డీఏ పీడీ, విజయనగరం.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం ..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

గర్ల్స్ హైస్కూల్, ఆపోజిట్ జూనియర్ కాలేజ్, బెలగాం, పార్వతీపురం

తేది : 16-09-2023 (శనివారం)

సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.

రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 96761 94128, 90102 04441

విద్యార్థుల్లో సృజనాత్మకతకు యువజనోత్సవాలు

- రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్, సైన్స్‌ఫెయిర్ పోటీలు



బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో రోటరీ క్లబ్ ప్రతినిధులు



సైన్స్ ఫెయిర్‌లో వివిధ రకాల నమునాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

విజయనగరం: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిని మరింత ప్రోత్సహించాలనే ముఖ్య ఉద్దేశంతో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది యువజన మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ అధ్యక్ష, కార్యదర్శులు ఉడత్తు రాజేష్, కార్యదర్శి అరుణ్‌లు పేర్కొన్నారు. మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహ భరిత వాతావరణంలో సాగాయి. పోటీల్లో 300 మందికి పైగా క్రీడాకారులు పాల్గొని ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. అదేవిధంగా నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్ పోటీల్లో 30 మంది విద్యార్థులు పాల్గొని వివిధ రకాల నమూనాలు ప్రదర్శించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అక్టోబర్2వ తేదీన బహుమతులు ప్రదానం చేయనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వెల్లడించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు జయకృష్ణ, మంచుకొండ అశోక్, సురేంద్రరెడ్డి, కృష్ణతేజ, శంకర్ రెడ్డి, అశోక్, టీఎల్‌ఎన్ మూర్తి, కట్టమూరి మధు, పూసర్ల మారుతి తదితరులు పాల్గొన్నారు.

మద్యం ధ్వంసం



కొట్టక్కి బ్రిడ్జి వద్ద ధ్వంసం చేస్తున్న మద్యం

సాలూరు: వివిధ కేసుల్లో పట్టుకున్న మద్యం, సారాలను పట్టణ పోలీసులు మంగళవారం ధ్వంసం చేశారు. వివిధ కేసుల్లో పట్టుకున్న 401 మద్యం బాటిల్స్, సుమారు 849.5 లీటర్ల సారాను ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీ మురళీధర్, ప్రొహిబిషన్ అధికారుల సమక్షంలో పట్టణ సమీపంలోని కొట్టక్కి బ్రిడ్జి వద్ద పోలీసులు నాశనం చేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

చైల్డ్‌వెల్ఫేర్ కమిటీల నియామకానికి చర్యలు

పార్వతీపురం: కొత్త జిల్లాలకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువెనైల్ జస్టిస్ బోర్డుల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని బాలల సంక్షేమం, సంస్కరణల సేవల శాఖ జిల్లా ప్రొబేషన్ అధికారి ఎం.శరత్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువెనైల్ జస్టిస్ బోర్డులు చైర్మన్, సభ్యులు సామాజిక కార్యకర్తల నియామకానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువును అక్టోబర్ మూడో తేదీవరకు పొడిగించినట్లు చెప్పారు. అర్హులైన అభ్యర్థులు హెచ్‌టీటీపీ://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీ.జీటీవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మూడేళ్ల బాలుడికి రూ.10వేల పింఛన్



బాలుడి కుటుంబానికి రూ.పదివేలు పింఛన్ అందజేస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు

చీపురుపల్లిరూరల్: పుట్టుకనుంచి తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చీపురుపల్లి మండలంలోని మెట్టపల్లి పంచాయతీ పరిధి ముల్లుపేట గ్రామానికి చెందిన మూడేళ్ల బాలుడు ముళ్ల భువన్‌సాయికి ప్రభుత్వం రూ.10వేలు పింఛన్ మంజూరు చేసింది. ఈ మేరకు స్థానిక సచివాలయంలో పింఛన్‌ను బాలుడి తండ్రి ముల్లు సూరికి పీఏసీఎస్ అధ్యక్షుడు చందక గురునాయుడు, ఎంపీటీసీ మీసాల ఈశ్వరరావులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తలసీమియా వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని ధీరా ఫౌండేషన్ అధినేత బొత్స సందీప్, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మిల దృష్టికి తీసుకువెళ్లగా వారు స్పందించి ఆరోగ్య మంత్రిత్వశాఖ అధికారులతో మాట్లాడి పింఛన్ మంజూరు చేయించారన్నారు. చిన్న బాలుడి కష్టానికి చలించి పింఛన్ మంజూరు చేయించిన బొత్స కుటుంబానికి తామంతా రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఉద్యోగిని ఆత్మహత్య

- పిల్లల పరిస్థితి విషమం



హైమావతి మృతదేహం

విజయనగరం క్రైమ్: కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న బోయిన హైమావతి (29) తాను గడ్డిమందు తాగడంతో పాటు తన ఇద్దరు బిడ్డలకు ఇచ్చి ఆత్మహత్యకు పాల్పడింది. చికిత్స పొందుతూ ఆమె సోమవారం రాత్రి మృతిచెందగా పిల్లల పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు మంగళవారం తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. కలెక్టరేట్‌లో రెవెన్యూ డిపార్టెమెంట్‌లో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న హైమావతి ఈ నెల 10న కామాక్షినగర్‌లోని తన ఇంట్లో మూడేళ్లపాప, ఏడాదిన్నర బాబుకు గడ్డిమందు తాగించి తాను తాగేసింది. అదే రోజు మక్కువ నుంచి హైమావవతి ఇంటికి వచ్చిన ఆమె సోదరి అపస్మారక స్థితిలో ఉన్న తల్లీపిల్లలను చూసి, వెంటనే జిల్లా కేంద్రాస్పత్రికి తరలించింది. కేంద్రాస్పత్రి నుంచి మెరుగైన చికిత్స కోసం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకు వెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ హైమావతి సోమవారం రాత్రి మృతిచెందింది. పిల్లల పరిస్థితి విషమంగా ఉంది.

దూరంగా భార్యాభర్తలు

మృతురాలి భర్త కుమార్ హైదరాబాద్‌లో జీఆర్‌పీ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. భార్యాభర్తలు వేర్వేరుగా ఉండడంతో పాటు ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్తాపం చెంది హైమావతి ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నామని పోలీసులు చెప్పారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై మురళి తెలిపారు.

పుష్పాలంకరణలో పైడితల్లి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు అమ్మవారికి కుంకుమార్చన చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

శరవేగంగా రైల్వేస్టేషన్ అభివృద్ధి



పార్వతీపురం రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం సౌరవ్ ప్రసాద్

- రూ. 20కోట్లతో పనులు
- మోడ్రన్ ఎఫ్‌ఓబీ, రిజర్వేషన్ కౌంటర్ల ఏర్పాటు
- పరిశీలించిన డీఆర్‌ఎం సౌరవ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం నూతన రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నట్లు రైల్వే డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) సౌరవ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం బెలగాం రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ. 20కోట్లతో పార్వతీపురం రైల్వే స్టేషన్ అమృత్ భారత్ పథకానికి ఎంపికై ందని చెప్పారు. పార్వతీపురం రైల్వేస్టేషన్‌కు సంబంధించి నూతన రైల్వేస్టేషన్ భవనం, మోడ్రన్ ఫ్లైఓవర్, ప్రస్తుతం ఉన్న ఫ్లై ఓవర్ సమీపంలో సాధారణ ఫ్లై ఓవర్, టికెట్ కౌంటర్, రిజర్వేషన్ కౌంటర్, ఫుడ్ ప్లాజా వంటి నూతన నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. సంవత్సరంలో పార్వతీపురం స్టేషన్ రూపురేఖలు మారుతాయని చెప్పారు. ప్రయాణికులకు అత్యాధునిక వసతులను సమకూర్చేందుకు అన్ని విధాలా చర్యలు చేపట్టామన్నారు. మూడవ రైల్వే లైన్ పనులు తుదిదశకు చేరుకున్నాయన్నారు. పార్వతీపురం నూతన జిల్లాగా ఏర్పడడంతో స్టేషన్ అభివృద్ధి, కమర్షియల్ కాంప్లెక్స్, పార్సిల్ సర్వీసులు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు స్థలాన్ని పరిశీలించామని, వాటిని త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. డీపీఎం సునీల్ కుమార్, ,సీనియర్ డీసీఎం ఏకె త్రిపాఠి, సీనియర్ డీఈ ఎస్‌డీ మీనా, స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రైల్వేస్టేషన్ పరిశీలన

సాలూరు: డీఆర్‌ఎం (డివిజనల్ రైల్వే మేనేజర్) సౌరబ్ ప్రసాద్ సాలూరు రైల్వే స్టేషన్‌ను మంగళవారం పరిశీలించారు.సాలూరు వరకు ట్రైన్‌తో ట్రయిల్ రన్ నిర్వహించారు.ట్రాక్ నాణ్యత, రైల్వే స్టేషన్‌లో వసతులు, పరిసరాలు తదితర అంశాలను పరిశీలించారు. పూర్తిస్థాయిలో పనులు చేపట్టి, సాలూరు నుంచి విశాఖపట్నం రైలుసేవలు త్వరలో ప్రారంభిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఆయన వెంట పలువురు రైల్వే అధికారులు ఉన్నారు. కాగా సాలూరుకు రైలు బస్సు కాకుండా పెద్ద రైలు రానుండడంతో స్థానికంగా సందడి వాతావరణం నెలకొంది.

విజయనగరంలో..

విజయనగరం టౌన్: ఈస్ట్‌కోస్ట్ రైల్వే డివిజనల్ మేనేజర్ సౌరభ్ ప్రసాద్ మంగళవారం విజయనగరం రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. ప్రత్యేక ట్రైన్‌లో వచ్చిన ఆయన విండో ట్రయయలింగ్ ద్వారా పర్యవేక్షించారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ ఇంజినీర్ కోఆర్డినేషన్ ఏకే.మెహరానా, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్, సీనియర్ డీసీఎం ఏకే .త్రిపాఠి, సీనియర్ డీఈఈ ఆపరేషన్స్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో డీఆర్‌ఎం

బొబ్బిలి: త్వరలో విశాఖ షటిల్‌ను బొబ్బిలి మీదుగా సాలూరు వరకూ నడిపేందుకు రైల్వే శాఖ సిద్ధమైన నేపథ్యంలో లైన్‌పరిశీలనకు డీఆర్‌ఎం సౌరవ్ ప్రసాద్ సోమవారం బొబ్బిలి రైల్వేస్టేషన్ నుంచి సాలూరు లైన్‌ను పరిశీలించారు. అక్కడి ప్రయాణికులు, బొబ్బిలిలో రైల్వే సిబ్బందితో మాట్లాడారు. అనంతరం బొబ్బిలి రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు.



సాలూరు రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న డిఆర్‌ఎమ్



రైల్వేలైన్ పరిశీలిస్తున్న డీఆర్‌ఎం

మర్యాదతో మరింత ఆదరణ

- డ్రైవర్లు, కండక్టర్లకు నిపుణులతో కౌన్సెలింగ్
- వారంలో ఒక రోజు జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో నిర్వహణ
- ఫిర్యాదుల నేపథ్యంలో ఆర్టీసీ ఉన్నతాధికారుల చర్యలు



కండక్టర్లు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డిప్యూటీ సీటీఎం అప్పలనాయుడు

సాక్షి, విశాఖపట్నం: ప్రయాణికుల పట్ల సిబ్బంది మర్యాదగా వ్యవహరించడంపై ఆర్టీసీ అధికారులు ఫోకస్ పెడుతున్నారు. పాసింజర్ల మన్ననలు పొందడానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఇందుకోసం ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి పట్ల కొంతమంది డ్రైవర్లు, కండక్టర్లు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఏకవచనంతో సంబోదిస్తున్నారని, బస్సులు సక్రమంగా ఆపడం లేదని, దురుసుగా సమాధానం చెబుతున్నారని.. ఇలా పలు ఫిర్యాదులు ఆర్టీసీ కంప్లయింట్ సెల్‌కు అందుతున్నాయి. ఈ ఫిర్యాదులను ఆర్టీసీ యాజమాన్యం సీరియస్‌గా తీసుకుంది. ఇకపై కండక్టర్లు, డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదగా మెలిగేలా చర్యలు చేపట్టింది. ఇందుకోసం కంప్‌లెంట్ సెల్‌కు అందిన ఫిర్యాదుల ఆధారంగా సంబంధిత కండక్టర్లు, డ్రైవర్లకు ప్రతి మంగళవారం కౌన్సెలింగ్ ఇవ్వాలని నిర్ణయించింది. ఆర్టీసీ జోన్–1కు సంబంధించి ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఈ కండక్టర్లు, డ్రైవర్లకు విజయనగరం జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఈ ప్రక్రియకు మంగళవారం నుంచే శ్రీకారం చుట్టారు. ఉదయం రెండు గంటలు, మధ్యాహ్నం రెండు గంటల చొప్పున ఆర్టీసీలో ఎంపిక చేసిన అధికారులతో పాటు బయట నుంచి నిపుణులు, లెక్చరర్లు, అడ్వకేట్లను కూడా రప్పించి వారితో సుహృద్భావ వాతావరణంలో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా మెలగాలని, వారు అడిగిన ప్రశ్నలు, సందేహాలకు దురుసుగా కాకుండా సామరస్యంగా సమాధానం చెప్పాలని, చిరాకు ప్రదర్శించకుండా మాట తీరు గౌరవప్రదంగా ఉండాలని, వారిని ఏకవచనంతో సంబోధించవద్దని, ప్రయాణికుల మన్ననలు పొందాలని సూచిస్తున్నారు. ఈ కౌన్సెలింగ్ ద్వారా వీరి ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్ల వ్యవహారశైలి ప్రయాణికులపై ప్రభావం చూపుతుందన్న భావనకు అధికార్లు వచ్చారు. కౌన్సెలింగ్ ద్వారా వీరు ప్రయాణికులతో స్నేహపూర్వకంగా మెలిగితే ఆర్టీసీపై ప్రయాణికుల ఆదరణ మరింత పెరుగుతుందని, ప్రైవేటు ఆపరేటర్ల వైపు మళ్లే అవకాశం ఉండదని వీరు భావిస్తున్నారు.

నిరంతరం కొనసాగిస్తాం...



ప్రయాణికులతో కండక్టర్లు, డ్రైవర్లు మర్యాదగా వ్యవహరించడం వల్ల ఆర్టీసీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుంది. దీంతో ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో పెరిగి ఆర్టీసీ ఆదాయం వృద్ధి చెందడానికి కూడా దోహదపడుతుంది. కంప్లయింట్ సెల్‌కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సంబంధిత సిబ్బందికి బ్యాచ్‌కు 10–15 మంది చొప్పున ఎంపిక చేసి నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం. దీనిని నిరంతరం కొనసాగిస్తాం.

– సి.రవికుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జోన్–1